## పార్వేటకు తరలిన అర్జునుడు



శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరిదైన పార్వేట ఉత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి అర్జునుడు, ద్రౌపదీ అమ్మవారిని చక్కగా అలంలకరించి సప్పర వాహనంలో ప్రతిష్టించారు. ఆలయ ఉత్సవ ఇన్‌చార్జి లక్ష్మయ్య,, ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్ వెంటరాగా ఉరేగింపుగా చెన్నై రోడ్డు, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, ముత్యాలమ్మగుడివీధి, బహాదూరుపేటల మీదుగా తొట్టంబేడు మండలంలోని కొత్తకండ్రిగ, జ్ఞానమ్మకండ్రిగ గ్రామాలకు వెళ్ళారు. అక్కడ విశేష సంఖ్యలో పూజలు జరిపారు. మొక్కులు తీర్చుకున్నారు. ఏడాదిలో ఒక రోజు నిర్వహించే ఈ కార్యక్రమాలకు విశేష స్పందన వస్తుంది. ఇదో పండగలా జరుపుకున్నారు. ఇంటింటి నుంచి అమ్మవారికి హారతులిచ్చారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## ఏనుగుల దాడుల నిరోధానికి చర్యలు చేపడతాం

రామకుప్పం, జూలై 9 ప్రభాతవార్త



రామకుప్పం మండలంలో ఏనుగుల దాడుల నిరోధానికి చర్యలు చేపడతామని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన 24మంది రైతులకు 1.98లక్షల రూపాయల చెక్కులను ప్రభుత్వం తరపున అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగుల దాడుల నిరోధంకు సోలార్ కంచె, కందకాల నిర్మాణాలకు చర్యలు చేపడ్తామన్నారు. కార్యక్రమంలో రేంజర్ జయశంకర్, రాష్ట్ర నేతలు మునస్వామి, పట్ర నారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, నేతలు నరసింహులు, ఆంజనేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, రామూర్తి, గంట్లప్పగౌడు, సీతాపతి, కృష్ణానాయక్, రఫీ, కామరాజు నాయక్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ శక్తులకు
# కేంద్రం దాసోహం
### శ్రీకాళహస్తి ఎర్రజెండాలతో రెపరెప



శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం బుధవారం ఎర్రజెండాల రెప రెపలతో కళ కళ లాడింది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె శ్రీకాళహస్తిలో విజయవంతం అయ్యింది. కార్మిక సంఘాలు కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఒక్కరోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలి నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలతో ఇబ్బందులు కల్గిస్తుందని వివరించారు. కార్మిక చట్టాలకు బదులు కార్మిక వ్యతిరేక కోడ్‌లను తెచ్చారని వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టారు. కార్మిక చట్టాలను పునరుద్దరించకుంటే ఉద్యమాలు ఉధృతం అవుతాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల బాగుకు కార్మికుల భవిష్యత్తును కాలరాస్తున్నారని శివమెత్తారు. కార్మిక సంఘాల నాయకులు బాలసుబ్రమణ్యం, మురళి, భారతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో కార్మికులను నిలువు దోపిడికి దోహదం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో గంధం మణి, జనమాల గురవయ్య, గోపి, వెంకటేష్, మణి, అంగన్‌వాడి నాయకులు పాల్గొన్నారు.

## ఏనుగుల ప్రవేశంపై సరిహద్దు ప్రాంతాలను పరిశీలించిన కేంద్ర బృందం



కుప్పం జూలై 9 ప్రభాతవార్త.

రాయల్ ఎలిఫెంట్ రిజర్వ్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న కుప్పం ప్రాంతంలోని రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలను బుధవారం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఏనుగులు ఎక్కడెక్కడ నుంచి ప్రవేశిస్తున్నాయని వారు స్థానిక అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు .గుడిపల్లి మండలం మల్లప్పకొండ తదితర ప్రాంతాల్లో వారు పరిశీలన జరిపారు. కార్యక్రమంలో ఢిల్లీ బృందంతోపాటు అడిషనల్ పిసిసిఎఫ్ శాంతి పాండే, సిసిఎఫ్ శరవనన్ ,జిల్లా అటవీ అధికారి భరణి ,ఇతర అధికారులు గురు ప్రభాకర్, వేణుగోపాల్, కుప్పం రేంజర్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత అంటే పట్టదా !

**- పేరుకే మామిడికి కనీస మద్దతు ధర,**
**ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకు అందని రూ.12 ధర**
**మాజీ సిఎం, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి**





**బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్, భారీగా తరలివచ్చిన మామిడి రైతులు, వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలు.**

బంగారుపాళ్యం, జులై 9 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలో రాష్ట్రంలో రైతుల జీవితాలు సర్వనాశనం అవుతున్నాయని, రైతు పండించిన ఏ ఒక్క పంటకు మద్దతు ధర అందించలేదని మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మామిడి రైతులను పరామర్శించడానికి బుధవారం బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ యార్డుకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విచ్చేశారు. మార్కెట్ యార్డులోకి వచ్చిన వైఎస్ జగన్‌కు అటు రైతులు, ఇటు వైకాపా కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మామిడి కాయల మండీల వద్దకు చేరుకున్న వైఎస్ జగన్ మామిడి రైతులతో కలిసి కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రైతు కష్టం ఏ మాత్రం పట్టదని, తాను రైతు బిడ్డ అని పేరుకు మాత్రమే చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. ఆరు కాలాలు శ్రమిస్తున్న రైతన్నలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. తోతాపురి మామిడి కిలో రూ.2కు అమ్మకాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక, మద్దతు ధర రూ.12 కల్పిస్తామని పత్రికా ప్రకటనలు ఇచ్చారన్నారు. కిలో మామిడికి ప్రభుత్వం రూ.4 సబ్సిడీ చెల్లిస్తున్నామని, మామిడి పరిశ్రమల యాజమాన్యం రూ.8 ప్రభుత్వ పరంగా రైతుకు అందేలా చూస్తామని సిఎం చంద్రబాబు నాయుడు పత్రికాముఖంగా చెప్పారన్నారు. అయితే ఇంత వరకు ఏ ఒక్క రైతు బ్యాంకు ఖాతాకు కేజీ రూ.12 చెప్పున జమ అయిన దాఖలాలు కన్పించడం లేదన్నారు. వైకాపా పాలనలో తోతాపురి మామిడికి మద్దతు ధర కేజీ రూ.22 నుండి రూ.29 వరకు ధర వుండేదని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా 52 మామిడి గుజ్జు పరిశ్రమలు వున్నా వాటిని ప్రభుత్వం సకాలంలో తెరిపించలేక, మామిడి ధరల పతనానికి పరోక్షంగా కారణమయ్యిందని దుయ్య పట్టారు. జిల్లాలో 6.45 లక్షల టన్నుల మామిడి దిగుబడి వుందని, సుమారు 76 వేల మంది రైతులు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రక్కనే వున్న కర్నాటక రాష్ట్రంలో జెడిఎస్ అధినేత కుమారస్వామి మామిడి ధరపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి తోతాపురి మామిడి కేజీ రూ.16కు కొనుగోలు చేసేలా ఒప్పదం చేసుకున్నారన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన నాయకులు రాష్ట్రంలో మామిడి రైతుల కష్టాలు పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆర్థికంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల మిరప, పొగాకు తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు రోడ్డెక్కారని, ప్రస్తుతం అదేవిధంగా మామిడికి సైతం దర లేనందు వల్ల రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలు కష్టాలకు గురవుతున్నారని, పరిపాలనపై దృష్టి పెట్టని పాలకులు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కక్ష సాధింపులు ఇలాగే కొనసాగితే వైఎస్ఆర్‌సిపి అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, మాజీ మంత్రి మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపి రెడ్డప్ప, మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్‌కె రోజా, ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, బియ్యపు మధుసూధనరెడ్డి, వెంకటేగౌడ, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, చిత్తూరు వైకాపా సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై మామిడి కాయలతో నిరసన

*బంగారుపాళ్యం, జులై 9 ప్రభాతవార్త:*

*మామిడి రైతులను పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం విచ్చేశారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కొత్తపల్లి సమీపం వద్ద వైఎస్ జగన్ కోసం హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో వైఎస్ జగన్ బంగారుపాళ్యంకు గంట ఆలస్యంగా వచ్చారు. హెలిప్యాడ్ నుండి మార్కెట్ యార్డుకు జాతీయ రహదారి సర్వీసు రోడ్డు గుండా వస్తుండగా పలువురు రైతులు మామిడికి గిట్టుబాటు ధర లేదని మామిడి కాయలను రహదారిపై పోసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కిలో మామిడి రూ.2 అమ్మకాలు జరుగుతున్నాయని, ఆ ధరకు మా కష్టం సరిపోదని నెపంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మామిడి కాయలను ట్రాక్టర్లలో తీసుకువచ్చి వైఎస్ జగన్ వెళ్ళే రహదారి మార్గంపై పోశారు. కూటమి పాలనలో మామిడి రైతుల దుస్థితి ఇది అని వైఎస్ జగన్ దృష్టికి మామిడి రైతులు తీసుకెళ్ళారు. రోడ్డుపై పారబోసిన మామిడి కాయలపైన ఇతర వాహనాలు వెళ్ళాయి. జిల్లాలో రోజు రోజుకు మామిడి పరిస్థితి క్షీణించడానికి ఇది నిదర్శనమన్నారు.*



### కాణిపాకం ఆలయంలో
# పాలాభిషేకంకు విరిగిన పాలు సరఫరా



కాణిపాకం, జులై 9 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో స్వామి వారికి జరిగే పాలాభిషేకం సేవకు టెండరుదారు విరిగిన పాలు సరఫరా చేసిన సంఘటనా బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా వున్నాయి. ప్రతి రోజు ఆలయంలో స్వామి వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో పాలాభిషేకం నిర్వహిస్తారు. పాలాభిషేకంకు అవసరమైన పాలను గుత్తేదారు టికెట్టు తీసుకున్న భక్తులకు సరఫరా చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం జరిగిన పాలాభిషేకంకు సైతం గుత్తేదారు యధావిధిగా పాలాభిషేకంకు అవసరమైన పాలను సరఫరా చేశారు. ఈ పాలు విరిగిపోయి(చెడిపోయి) వుండటంను భక్తులు గుర్తించి గుత్తేదారుడిని ప్రశ్నించారు. విరిగిన పాలను స్వామి వారి అభిషేకంను ఎలా సరఫరా చేస్తావంటూ తీవ్ర స్థాయిలో గుత్తేదారుడని ప్రశ్నించారు. ఈ విషయంను భక్తులకు ఆలయ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో గుత్తేదారు భక్తులకు సరఫరా చేసిన పాలను తిరిగి తీసుకుని బాగున్న పాలను అందజేశాడు. స్వామి వారికి భక్తి శ్రద్ధలతో నిర్వహించే పాలాభిషేకానికి విరిగిపోయిన పాలను సరఫరా చేయడం పట్ల భక్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆలయ ఇఓ పెంచల కిషోర్‌ను వివరణ కోరగా పాలాభిషేకం భక్తులకు విరిగి పోయిన పాలను సరఫరా చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు. అయితే ఈ పాలను తిరిగి తీసుకుని నాణ్యమైన పాలను భక్తులకు అందించడం జరిగిందని తెలిపారు. పాలాభిషేకానికి విరిగిపోయిన పాలను సరఫరా చేసిన గుత్తేదారు టెండరును రద్దు చేసి దేవస్థానం తరపునే పాలను సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

## నాణ్యమైన ఆహారపదార్థాలు అందించాలి
### -నిబంధనలకు లోబడి క్యాంటీన్లు కేటాయింపు
### -టిటిడి ఈఓ ,అదనపు ఈఓ



తిరుమల, జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవారి దర్శనానికి వస్తున్న భక్తులకు సంప్రదాయమైన ఆహారపదార్థాలను అందించడంలో జనతా క్యాంటీన్లు, పెద్ద హోటళ్ళు నాణ్యత పాటించాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్పష్టం చేశారు. నిర్ధారించిన నియమాలకు లోబడి హోటళ్ళు, క్యాంటీన్ల కేటాయింపు ఉంటుందన్నారు. తిరుమలలో జనతా, పెద్ద హోటళ్ళకు టెండర్లు ఖరారుచేయడానికి ముందు బుధవారం మధ్యాహ్నం హోటళ్ళ నిర్వాహకులతో పరిపాలన భవనంలో టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సమావేశం నిర్వహించారు. జనతా, పెద్ద హోటళ్ళు, క్యాంటీన్లలో భక్తులకు సేవా దృక్పథంతో నాణ్యమైన ఆహారపదార్థాలు, లాభాపేక్ష లేకుండా పరిశుభ్రతతో నిర్ధేశించిన ధరలకు అందించాలని ఈఓ సూచించారు. హోటళ్ళ నిర్వాహకులు వ్యక్తం చేసిన పలు సందేహాలను టిటిడి అధికారులు నివృత్తి చేశారు.

## పిల్లలకు నాణ్యమైన వైద్య సేవలు
### - ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు



చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:

చిన్న పిల్లల్లో వైకల్యం తగ్గించడానికి త్వరిత గుర్తింపు, త్వరిత చికిత్స అందించడమే డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ లక్ష్యమని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు పేర్కొన్నారు. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో బాలలకు సత్వర చికిత్స కేంద్రంను రూ.1.78 కోట్ల వ్యయంతో బుధవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ డిఇఐసి కేంద్రం ఆర్‌బిఎస్‌కె రాష్ట్ర బాల ఆరోగ్య స్వస్థ కార్యక్రమం కింద ఎన్‌హెచ్‌ఎం జాతీయ ఆరోగ్య మిషన్ పరిపాలనలో పని చేస్తోందన్నారు. ఈ కేంద్రం నాలుగు రకాల లోపాలపై 4డిఎస్ ప్రధానంగా పని చేస్తోందన్నారు. ఇందులో పుట్టుక సమయంలో లోపాలు, అభివృద్ధి లోపాలు, వ్యాధుల ద్వారా వచ్చే లోపాలు, మొత్తం 30 ఆరోగ్య సమస్యలు ఎంపిక చేయబడి స్క్రీనింగ్, త్వరిత గుర్తింపు, ఉచిత చికిత్సకు లోబడి పచి చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పుట్టిన పిల్లల్లో దాదాపు 5 శాతం పిల్లలు నడవకపోవడం, మాట్లాడకపోవడం, మానసిక, శారీరక ఎదుగుదల లేకపోవడం తదితర లోపాలు వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మరో మైలురాయిని అధిగమించిన శ్రీసిటీ
### - వీఆర్వీ పరిశ్రమ
### ఖతార్ ఎయిర్ లిక్విడ్ సంస్థకు ఉత్పత్తుల ఎగుమతి

సత్యవేడు, జూలై 9 ప్రభాతవార్త:



శ్రీసిటీలో క్రయోజెనిక్ ట్యాంకుల తయారీ అగ్రగామిసంస్థ యూఎస్‌ఏ చార్ట్ ఇండస్ట్రీస్ కు చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ, ఖతార్‌లోని ఎయిర్ లిక్విడ్ సంస్థకు అధిక సామర్థ్యం కలిగిన(సూపర్-సైజ్డ్) లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజీ ట్యాంకును ఎగుమతి చేయడం ద్వారా మరో ప్రధాన మైలురాయిని అధికమించింది. ఎయిర్ లిక్విడ్ ప్రపంచంలోని ప్రముఖ పారిశ్రామిక వాయువుల తయారీ సేవల సంస్థ. ఇది 75 కంటే ఎక్కువ దేశాలలో ఆరోగ్య సంరక్షణ, ఏరోస్పేస్ రంగాల పరిశ్రమలకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం ఎగుమతి చేస్తున్న 47 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 214 టన్నుల బరువు కలిగిన భారీ క్రయోజెనిక్ ట్యాంకు, వీఆర్‌వీ అధునాతన ఇంజనీరింగ్ సామర్థ్యాలకు ప్రతీకంగా నిలుస్తుంది. మంగళవారం ఇందుకు సంబంధించిన మొదటి ఎగుమతి ట్యాంకును 192 చక్రాల మల్టీ యాక్సిల్ వాహనం ద్వారా కృష్ణపట్టణం పోర్టుకు తరలించారు. ఈ సరఫరా ద్వారా అంతరిక్ష రంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజెనిక్ నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు వీఆర్వీకి దక్కింది. కోవిడ్ 19 సంక్షోభ సమయంలో కీలక పాత్ర పోషించి దేశవ్యాప్తంగా వైద్య ఆక్సిజన్ సిలిండర్లు నిల్వ ట్యాంకులను వీఆర్‌వీ సరఫరా చేసింది. శ్రీసిటీ విరాళంగా తిరుపతి స్విమ్స్, బర్డ్, రుయా ఆస్పత్రులతో సహా తిరుపతి, నెల్లూరు జిల్లాలోనిప్రభుత్వ ఆస్పత్రులకు అందజేసిన ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను సకాలంలో సరఫరా చేసి వీఆర్వీఎంతో సహకరించింది.

## శేషవాహనంపై దశరథ తనయుడు



తవణంపల్లె, జూలై 9 ప్రభాతవార్త:

మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకోదండరాముడు సీతా లక్ష్మణ సమేతంగా శేష వాహనదారుడై గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమించారు. బ్రహ్మోత్స వాల్లో ఐదో రోజు స్వామివారికి శేషవాహనసేను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి చిత్తూరుకు చెందిన ఎన్.సాంబశివారెడ్డి ఉభయదా రులుగా వ్యవహరించారు. శేషవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. అలాగే ఆలయంలో ఉదయం టి.పుత్తూరుకు చెందిన శివశంకర్‌రెడ్డి ఉభయదారుడుగా, శరవణభవరెడ్డి ఉభయదారుడిగా పాలాభిషేకం, సాయంత్రం ఎన్.కరుణాకర్‌రెడ్డి అండ్ సన్స్ ఉభయదారులుగా ఊ ంజల్‌సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉభయజిల్లాల అధికారులకు బదిలీ(ల) గుబులు !
### -తిరుపతిజిల్లాకు రావడానికి పలువురు ఆసక్తి

తిరుపతి, జూలై 9ప్రభాతవార్త:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్న తరువాత తొలిసారిగా పలు జిల్లాల్లోని జిలా కలెక్టర్లు, జిల్లా ఎస్పీల మార్పులుచేర్పుల కసరత్తులో సిఎం సొంత ఉభయజిల్లాల అధికారుల్లోనూ బదిలీల గుబులు రేకెత్తుతోంది. పాలనపరమైన విధానాలతో ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు బదిలీలు పారదర్శకంగా చేపట్టేందుకు స్వయంగా సిఎం చంద్రబాబునాయుడు కసరత్తుచేస్తున్నారనేది సమాచారం. గత ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కొంతకాలానికి ఉన్నఫళంగా కొందరు ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లకు సముచితస్థానాల్లో పోస్టింగ్‌లు కల్పించారు. అయితే జిల్లాల్లో అభివృద్ధి పరంగా పరిపాలన సక్రమంగా లేదనే విమర్శలు, ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించడంలేదనే విషయం సిఎం వరకు వెళ్ళింది. ఈ నేపథ్యంలో ఏడాది పాలన తరువాత తొలిసారి చేస్తున్న ఐఏఎస్, ఐపిఎస్‌ల బదిలీల్లో టిటిడిలో చాలాకాలంగా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులకు స్థానచలనం కలిగించాలని సిఎం గతంలోనే వెల్లడించారు. పలువురు అధికారులు ఇప్పటికీ వైసిపి నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు పార్టీ నేతలనుండి ప్రభుత్వానికి వెళ్ళింది. అనంతపురం రేంజి డిఐజి కూడా ఎన్నికలకు ముందు బాధ్యతలు చేపట్టి చాలాకాలంగా పనిచేస్తున్నారనే చర్చ ఉంది. ఉభయజిల్లాల్లో ఒక కలెక్టర్, ఒక ఎస్పీ పేర్లు వినిపిస్తున్నాయి. ఇంకా టిటిడి జెఇఓ బదిలీ తప్పదనేది సమాచారం. ఆయా స్థానాల్లో మరింత పాలనపరమైన సమర్థవంతమైన అధికారులను నియమించేందుకు సిఎం చంద్రబాబు నిర్ణయం మేరకు రానున్నారు. ఇప్పటికే ఇన్‌ఛార్జి మంత్రుల నుండి కూడా అభిప్రాయాలు తీసుకుని ఈ రెండు జిల్లాలపై సిఎం స్వయంగా ప్రత్యేక దృష్టి పెట్టారనేది పార్టీ వర్గాల సమాచారం.

## డబుల్ ఇంజన్ సర్కారు విశ్వగురువు కావటం తథ్యం: ఎంపి

శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త

దేశంలో 2047 నాటికి డబుల్ ఇంజన్ సర్కారు ప్రపంచ దేశాల్లో విశ్వగురువుగా నిలవటం తథ్యమని రాజ్యసభ సభ్యుడు వెంకట సత్యనారాయణ అన్నారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం సహాకారంతో నేడు ఆంధ్రప్రదేశ్ రూపు రేఖలు మారుతున్నాయన్నారు. ప్రాజెక్టులకు జీవం వచ్చిందన్నారు. రాజధాని అమరావతి కి నిధులు అందిస్తూ కావాల్సిన అనుమతులివ్వబడుతున్నాయని ఆయన అన్నారు. ఆంధ్రరాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కోరిన నిధులను అందిస్తున్నారన్నారు. ఓ వైపు రాజధాని మరో వైపు రోడ్డు, రైల్వేల సదుపాయాలకు సంబంధించి కొరిన వెంటనే మంజూరు చేస్తున్నారని వివరంచారు. 2047 నాటికి భారత్‌ను విశ్వగురువుగా నిలుపుటకు ప్రధాని నరేంద్రమోదీ కట్టుబడి పని చేస్తున్నారన్నారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, కండ్రిగ ఉమ, మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, ఆర్ హరీష్‌రెడ్డి, కటికం చందు రాయల్, వేదాం కృష్ణయ్య, పూజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, తిరుమలశెట్టి నరేష్, బాగీర్తి వవెంకటేష్, కుప్ప ప్రసాద్, కోనేటి అయ్యప్ప, రవి తేజ, హరి చిన్న, పవన్, చెంచురెడ్డి, చటు కుమార్, దొరబాబు, గిరిధర్‌సాయి, నాని తదితరులు పాల్గొన్నారు.

# కుప్పం అభివృద్ధి ప్రదాత సిఎం చంద్రబాబు

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, జూలై 9 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత అని ప్రభుత్వ విప్, కడ పొలిటికల్ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 166వ బూత్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంను ఆయన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ది కలిగించడం జరుగుతుందన్నారు. కుప్పం అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అర్హులకు పె ంచిన పెన్షన్లు, తల్లికి వందనం, రైతులకు అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం సైతం కల్పించడం జరుగుతోందన్నారు. ఇవన్నీ సిఎం



చంద్రబాబు ఏడాది కాలంలో ఆర్థిక కష్టాలున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేసే నాయకుడిని మరచిపోరాదని కోరారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డా॥ సుధీర్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సోమశేఖర్, కో ఇన్‌చార్జ్‌లు శ్యాంసుందర్,తిరుమగళ్, కౌన్సిలర్ సురేష్, నేతలు ఆర్‌ఆర్ రవి, మంజు, శివదేవర్, జయరాంనాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా జిల్లా గ్రీవెన్స్‌సెల్ సభ్యుడుగా పవన్‌రాయల్

**చౌడేపల్లి, జూలై 9 ప్రభాతవార్త**



వైకాపా జిల్లా గ్రీవెన్స్ సెల్ కార్యనిర్వాహక సభ్యుడుగా చౌడేపల్లికి చెందిన పవన్ రాయల్ నియమితులయ్యారు. ఈమేరకు వైకాపా కేంద్రీయ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు పవన్ రాయల్ తెలిపారు. తనపై నమ్మకంతో ఇంతటి పదవిని అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## సిపిఐ రాష్ట్ర నాయకుడికి ఘన సన్మానం

**తిరుచానూరు, జూలై 9, ప్రభాతవార్త :**



సిపిఐ పార్టీ నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య ఆ పార్టీ కామ్రేడ్లు తిరుచానూరులోని రామకృష్ణారెడ్డి కాలనీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతి యమ్ అర్ పల్లి పార్టీ కార్యదర్శి చలంరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తమ నాయకుడు పెంచలయ్యకు కేక్ కట్ చేసి దుస్సాలువతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటువంటి చిన్న చిన్న సంబరాలు నిర్వహించడం కన్నా ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే తనకు మిక్కిలి సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సభ్యులకు సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటానికి తాను ముందుండి పోరాడడానికి ఎల్లవేళలా సంసిద్ధంగా వుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మునస్వామి, శ్రీను, హరి,సుధాకర్, నాగరాజు, మునంద్ర, గిరి, ఎన్.మంజుల, యమ్. మంజులరెడ్డి, విజయ్ రెడ్డి వీణ, టి. నాగరాజ్, కృష్ణ, బాలకృష్ణ, శంకర తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమంపై ప్రభుత్వం అడుగులు

**పాలసముద్రం, జులై 9 ప్రభాతవార్త:**



అధికారం చేపట్టి ఏడాది పూర్తి కావడంతో రాష్ట్ర లోటుపాట్లను సరిదిద్దుకుని ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అడుగులు వేస్తోందని తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు. వనదుర్గాపురం పంచాయతీలో తెలుగుదేశం మండల ప్రధాన కార్యదర్శ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో నాయకులు రామకృష్ణమరాజు, సుబ్రమణ్యం మండడిలు బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రాజు ప్రజలతో మాట్లాడుతూ గత ప్రభుత్వం కుటుంబంలోని ఒక పిల్లవాడికి మాత్రమే అమ్మఒడి కింద రూ.15 వేలు చెల్లిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కుటుంబంలో ఎంత మంది పిల్లలు వున్నారో అంత మందికి రూ.15 వేలు చెల్లిస్తోందన్నారు. పెన్షన్ల మొత్తంను రూ.4 వేలకు పెంచడం, పట్టణ ప్రాంతాల్లో చెత్తపై పన్న రద్దు చేయడం, పేదల కడుపు నింపడానికి అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడం ప్రభుత్వం చేసిందన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుందన్నారు. ఈ కార్యక్రమంలోదేశంనాయకులుపురుషోత్తంమండడి, అరుళ్‌నాధన్, నవీన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపీ నాయకుని ఇంట సిపిఐ నారాయణ సందడి

**శ్రీకాళహస్తిరూరల్,జూలై 9 ప్రభాతవార్త**



రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు, శాశ్వత మిత్రుత్వా లుండవని చెబుతారు.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురం గ్రామంలో వైసిపి నాయకుని ఇంటి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కంకణాల నారాయణ సందడి సృష్టించారు. తొండమాన్‌పురంలో నివాసముంటున్న వైకాపా మండల నాయకుడు బ్రహ్మ భూషణరెడ్డి నారా యణకు పాత మిత్రుడు.శ్రీకాళహస్తిలో పార్టీ కార్యక్రమాలకు వచ్చిన సిపిఐ నాయకుడు నారాయణ,పార్టీ నాయకులు రామానాయుడు, గురవయ్యతో హేమభూషణరెడ్డి ఇంటికి వచ్చారు. వారిని హేమభూషణ ంరెడ్డి సొదరులు సాదరంగా ఆహ్వానించారు.వారికి విందు ఏర్పాటు చేసారు.వారి కుటుంబంలోనేకాకుండా గ్రామంలో కూడా సందడి చోటు చేసుకుంది. నారాయణ మాట్లాడుతూ తాము ఇద్దరు తమ అభిప్రాయాలకు అనుగుణంగా వేర్వేరు పార్టీలో ఉన్నామని ,అయితే తాము ఎన్నో దశాబ్దాలుగా మంచి మిత్రులమన్నారు.హేమభూషణరెడ్డి తమ కుటుంబసభ్యులను పరిచయం చేసారు.

## రేణిగుంటలో పాక్షికంగా భారత్ బంద్....

**రేణిగుంట జులై 9 ప్రభాతవార్త**

రేణిగుంట పట్టణంలో వివిధ కార్మిక సంఘాలు చేపట్టిన భారత్ సార్వత్రిక బంద్ బుధవారం పాక్షికంగా జరిగింది. రేణిగుంట పట్టణ ప్రధాన వీధుల్లో సిపిఎం, వాటి అనుబంధ కార్మిక సంఘాలు చేపట్టిన ర్యాలీ వామపక్ష నేతలు జిల్లా సిఐటియు నేత ప్రసాద్ రావు, సిపిఎం నేతలు ఓవి రమణ, హరినాథ్, సెల్వరాజ్, ఈశ్వరమ్మ, రాజేశ్వరి, తదితరుల ఆధ్వర్యంలో శాంతియుతంగా జరిగింది. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా మానవహారం నిర్మించారు. మజ్దూర్ సంఘ్ బ్రాంచ్ చైర్మన్ మునయ్య, వర్క్ షాప్ డివిజన్ సెక్రెటరీ ఎంజీ అరుణ్ కుమార్, సెక్రటరీ శశిధర్, మురుగ ప్రసాద్, ఆధ్వర్యంలో సమ్మె చేశారు. ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్ మెన్ ఫెడరేషన్, నేషనల్ కోఆర్డినేషన్ ఆఫ్ పెన్షనర్స్ ఇచ్చిన పిలుపుమేరకు రేణిగుంట రైల్వే రిటైర్డ్ అసోసియేషన్ బ్రాంచ్ కొత్త పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ బ్రాంచ్ చైర్మన్ అసం, బ్రాంచ్ కార్యదర్శి జయంత్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. రేణిగుంట సి ఆర్ ఎస్ పెన్షనర్స్ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు వర్కింగ్ చైర్మన్ గజపతి నాయుడు అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలి

**కుప్పం, జూలై 9 ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కుటుంబ సాధికార సభ్యులు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ సూచించారు. బుధవారం మల్లానూరు, టి.సదుమూరు యూనిట్‌ల కుటుంబ సాధికార సభ్యుల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీలో కెఎస్ఎస్ సభ్యులకుభవిష్యత్తు ఉంటుందన్నారు. వారి పరిధిలో ఉన్న కుటుంబాలతో నిత్యం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు చేరువ చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల్లో లబ్ది కలిగేలా చూడాలన్నారు. పనితీరును బట్టి పదవులు లభిస్తాయన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో కెఎస్ఎస్ సభ్యులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రామచంద్ర, ఐటిడిపి శరవణ, నేతలు చంద్రశేఖర్, విభూషణ్, దామోదర్, మోహన్, తిరుపతి, రమేష్, చంద్ర, ప్రకాష్, ఆర్ముగం, నాగార్జున, అశోక్, సంతానం, అన్నాదొరై, రాజా, వెంకటప్ప శెట్టి పాల్గొన్నారు.

## డిసిసిబి ఛైర్మన్ అమాసకు ఘన సత్కారం

**కుప్పంరూరల్, జూలై 9 ప్రభాతవార్త**



జిల్లా సహకార బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డిని బుధవారం కుప్పంలో తెదేపా నేతలు ఘనంగా సత్కరించారు. కుప్పంలోని డిసిసి బ్యాంకును ఛైర్మన్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయనను నేతలు సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జాకీర్, జిమ్‌దాము, నేతలు మంజు, ఉమాపతి, నాను పాల్గొన్నారు. కాగా తనపై నమ్మకం ఉంచి ఛైర్మన్ పదవి అప్పగించిన సిఎం చంద్రబాబునాయుడుకు ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## 4.5కోట్లతో నూతన తారురోడ్డు పనులకు భూమిపూజ

**శాంతిపురం, జూలై 9 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండలంలోని ఏడోమైలు క్రాస్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు 4.5కోట్ల వ్యయంతో నూతనంగా తారురోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 9.5కి.మీ.ల మేర ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లపై గు ంతలు పూడ్చే దిక్కు కూడా లేకుండా పోయిందన్నారు. నేడు కుప్పంలో 53కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, మణి, బసవరాజు, రమేష్, బాలు, హరినాథరెడ్డి, చంద్ర, నాగరాజు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మఠం హైస్కూల్‌లో నీటిశుద్ధి యంత్రం ప్రారంభం

**శాంతిపురం, జూలై 9 ప్రభాతవార్త**



మండలంలోని మఠం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం నీటిశుద్ధి యంత్రాన్ని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు ద్వారా విద్యార్థులకు ఉచితంగా నీటి బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, ఎల్.జయరాంరెడ్డి, బాలు, రమేష్, గోపాల్, నాగరాజు, రాజు పాల్గొన్నారు

## సమస్యల పరిష్కారంకై అంగన్‌వాడీకార్యకర్తల ర్యాలీ

**శాంతిపురం, జూలై 9 ప్రభాతవార్త**





తమ సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం శాంతిపురంలో అంగన్‌వాడీ కార్య కర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని కనీస వేతనంగా 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక కోడ్ రద్దు చేయడంతో పాటు బాల సంజీవని యాప్‌లో మార్పులు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వడంతో పాటు పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు.

## నేడు షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

***చౌడేపల్లి, జూలై 9 ప్రభాతవార్త***

మండల కేంద్రమైన చౌడేపల్లిలో గల షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు సేవాసమితి సభ్యులు తెలిపారు. ఉదయం ఆలయంలో కాగడా హారతితో మొదలై వివిధ కార్యక్రమాలనంతరం రాత్రి శేజ్ హారతితో వేడుకలు ముగుస్తాయన్నారు. బోయకొండ మాజీ ఛేర్మన్లు, ఆలయ దాతలు ఎస్.కె.వెంకట్రమణారెడ్డి, రతీదేవిల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం వివిధ రకాల పుష్పాలతో అలంకరణ వంటివి జరుగుతాయన్నారు. భక్తులు గురుపౌర్ణమిన స్వామివారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వ్యతిరేక విధానం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

**పుంగనూరు, జూలై 9, ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని చిత్తూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. పుంగనూరు పట్టణంలోని బ్యాంకు శాఖ ఎదుట వారు కర్తవ్య విరమణ చేసి ఆందోళన చేపట్టారు. కార్మికులను కట్టుబాటు చేసేందుకు కేంద్రం తీసుకువచ్చిన కార్మిక కోడ్లు అసంవిధానికమైనవని, అవి ఉద్యోగ హక్కులను హరించే విధంగా ఉన్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని తక్షణమే ఉపసంహరించాల్సిందిగా డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తూ తమ ఆందోళన నిర్వహించారు.

## పని దారుణం వేతనం హీనం

ఇది అంగన్వాడీల పరిస్థితి

**పుంగనూరు రూరల్, జూలై 9, ప్రభాతవార్త**



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, దశాబ్దాల తరబడి తమతో వెట్టిచాకిరి తక్కువ వేతనాలు ఇస్తున్నారని అంగన్వాడీలు ఆగ్రహించారు. బుధవారం పుంగనూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ. 26,000గా నిర్ణయించాలని, పని గంటలు తగ్గించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ వారు డిమాండ్ చేశారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. అనంతరం వారు తమ డిమాండ్లపై వినతిపత్రాన్ని సిడిపిఓ రాజేశ్వరికి అందజేశారు.

## నేడు టీడీపీ ఇన్చార్జి చల్లా పర్యటన

**పుంగనూరు, జూలై 9, ప్రభాతవార్త**



నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి గురువారం పట్టణంలో పర్యటించనున్నారు. పట్టణంలో జరిగే ఆయన పర్యటనను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పార్టీ వర్గాలు ఇప్పటికే నియోజకవర్గంలో మంచి పట్టు సాధించిన చల్లా బాబు పట్టణ మండల ప్రాంతాలలో ప్రధానమైన సమస్యలపై దృష్టి సారించేందుకు ఇప్పటికే నియోజకవర్గంలో అన్ని మండలాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు తోపాటు పుంగనూరు పట్టణంలో కీలకంగా చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన అధికారులు పార్టీ నేతలతో సమీక్షించే అవకాశం ఉంది. శుక్రవారంమేలుపట్ల సబ్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ర్యాలీ ప్రారంభమై తాజ్ మహల్ థియేటర్ వరకు సాగుతుంది. అక్కడ టీడీపీ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పథకాలపై తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటున్నారు. టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## నేడు ఎర్రాతివారి పల్లెలో బాబు

## షూరిటీ మోసం గ్యారంటీ నియోజకవర్గ సభ

**సదుం, జూలై 9, ప్రభాతవార్త** సదుం ఎర్రాతివారిపల్లిలో పుంగనూరు నియోజకవర్గ స్థాయి బాబు షూరిటి మోసం గ్యారంటీ కార్యక్రమం జరుగుతుందని జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి మండల వైసీపీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డిలు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో సదుం మండలంలోని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు. సర్పంచులు, ఎంపిటిసిలు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ,వాటర్ షెడ్ కార్యవర్గ సభ్యులు, మాజీ సింగల్ విండో కార్యవర్గ సభ్యులు, మాజీ సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు అందరూ వైఎస్‌ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో సహా తప్పక హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు హాజరవుతారని ఆయన చెప్పారు.

## జిల్లా వైఎస్‌ఆర్సీపీ విద్యార్థి విభాగ కార్యదర్శిగా నరేష్ బాబు

**యర్రావారిపాలెం, జూలై 9, ప్రభాతవార్త**

ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగ కార్యదర్శిగా చంద్రగిరి నియోజకవర్గం, యర్రావారి పాలెం మండలం చింతగుంటకు చెందిన రెడ్డిచెర్ల నరేష్ బాబును నియమిస్తూ పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందించాలని అన్నారు. అందుకు గాను గుర్తింపుగా విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేశారని అన్నారు. ఈ సందర్భంగా రెడ్డిచెర్ల నరేష్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి శక్తివంతన లేకుండా అభివృద్ధి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ వైఎస్‌ఆర్సిపి ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటర్ల నమోదు పై అవగాహన అవసరం : తహశీల్దార్ బాబు

**వెదురుకుప్పం, జూలై 9 ప్రభాతవార్త :**



ఓటర్ల నమోదు చేయడంపై బూత్ లెవల్ అధికారులకు అవగాహన అవసరమని తహశీల్దార్ బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు కార్యక్రమం పై అర్హులకు అవగాహన కల్పించి ఓటర్లుగా నమోదు చేయించవలసిన బాధ్యత అధికారుల పై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటర్లు కీలకమని 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి పౌరుడుని ఓటర్లుగా చేర్పించాలని చెప్పారు. అలాగే ఫారం 6 నింపడం ఇతర సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్, విఆర్‌వోలు శాంబశివా రెడ్డి, హేమాద్రి రెడ్డి, ధనశేఖర్, లోకనాథ రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ ఛైర్మన్లుగా నారాయణస్వామి.. హరినాథ్‌రెడ్డి

**వి.కోట, జూలై 9 ప్రభాతవార్త**

మండలంలోని ముదరందొడ్డి, వి.కోట (గోనమాకులపల్లి) సింగిల్ విండో ఛైర్మన్లు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వి.కోట సింగిల్‌విండో ఛైర్మన్‌గా నారాయణస్వామి, సభ్యులుగా జయప్ప, మూర్తిలను నియమించారు. అలాగే ముదరందొడ్డి పిఎసిఎస్ ఛైర్మన్‌గా హరినాథ్‌రెడ్డి, సభ్యులుగా రాధాకృష్ణ, చిన్నప్పలను నియమించారు.



## దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కదం తొక్కిన కార్మికులు



**పుత్తూరు రూరల్, జూలై 9 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సీఐటీయూ) ఆలిండియా ట్రేడ్ యూనియన్ వైసీపీ(ఏఐటీయూసీ), పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎల్ఐసీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మహా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పని గంటలను పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు మహేష్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి మునికుమారి, విజయకుమారి, ఎల్ఐసీ లక్ష్మిమూర్తి, దస్తగిరి, ఏఐటీయూసీ రవి, మనీ, కృష్ణారెడ్డి, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు రాధా, లలిత, అంబికా, కృష్ణవేణి, జయంతి, గంగులమ్మ, పద్మజ, జయంతి, గంగులమ్మ, పద్మజ, ధనమ్మ, హైమావతి, ఆటో యూనియన్ విజయ్, దేవరెడ్డి, యాసిన్ బాషా, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## కారు ఢీకొని సిఆర్‌యస్ ఉద్యోగికి తీవ్రగాయం



**రేణిగుంట జూలై 9 ప్రభాతవార్త** రేణిగుంట సిఆర్ఎస్ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సిఆర్ఎస్ ఉద్యోగి కాలు విరిగి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సిఆర్‌యస్ నందు ఉద్యోగం చేస్తున్న రేణిగుంటకు చెందిన వెంకటనారాయణ (42) ఆటోలో వెనుక కూర్చుని వస్తుండగా వెనుక వైపు నుండి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట నారాయణ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం సిఆర్ఎస్ ఆసుపత్రికి తరలించారు..

## నేడు శ్రీ షిరిడీ సాయిబాబాకు పాలాభిషేకం

**పుత్తూరు రూరల్, జూలై 9 ప్రభాతవార్త:**

పుత్తూరు పట్టణం టీబీ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబాకు గురువారం ఉదయం 4.30 గంటలనుంచి ఉదయం 9 వరకు భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సాయిబాబా నిత్య అన్నదాన సంఘ సమాజం వారు తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే ప్రత్యేక రుసుము 100 రూపాయలు చెల్లించిన వారికి ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి

**విజయపురం, జూలై 9 ప్రభాతవార్త:**



దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మికుల సార్వత్రిక సమ్మెలోభాగంగా బుధవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పల్గొన్నారు.

## సింగిల్‌విండో అధ్యక్షులుగా బాబు యాదవ్, బాబునాయుడు



***విజయపురం, జూలై 9 ప్రభాతవార్త:*** మండలంలోని కోసలనగరం సింగిల్‌విండో అధ్యక్షుడిగా ఎం.బాబుయాదవ్, అగరం రామకృష్ణ సింగిల్‌విండో అధ్యక్షుడిగా కె.బాబు నాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా మీద నమ్మకం ఉంచి పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

## దుకాణాలపై పోలీసుల దాడి

### టొబాకో చట్టంలో జరిమానాలు

**శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని పానగల్ పరిసర ప్రాంతాల్లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరిసరాల్లో ంరెండు రోజులుగా పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి టొబాకో చట్టం కింద తనిఖీలు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో రెండు రోజులు 20 మందికి జరిమానాలు విధించినట్లు వన్ టౌన్ సిఐ డి.గోపి బుధవారం తెలిపారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మత్తుపదార్దాల వాడకం అధికమౌతుంది. పోలీసులు తమ పరిధిలో చర్యలు తీసుకుంటున్నా యువత మత్తును వీడటం లేదు.దాంతో గొడవలు,దాడులు జరుగుతున్నాయి. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి టౌన్ సిఐ డి.గోపి సారధ్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ జరిపారు.జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో స్థానిక డివైయస్పి నరసింహంమూర్తి పర్యవేక్షణలో జరిపిన దాడుల్లో ఇక్కడి దుకాణాల్లో విచ్చల విడిగా బీడిలు,సిగరెట్లు అమ్ముతున్న వారిని చైతన్య వంతున్ని చేసారు. 'సేప్ క్యాంపస్' కార్యక్రమాల్లో భాగంగా ఈ దాడులు జరిపినట్లు సిఐ డి.గోపి వివరించారు.కోబాక్టో యాక్టు కింద ఎనిమిది మందికి జరిమాన విధించటం జరిగింది. టోబాకో యాక్టు ప్రకారం అమ్మటం నేరమని వివరించారు. మరో సారి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## బిఎల్‌వో ఎలక్షన్ ట్రైనింగ్ క్యాంపులో పాల్గొన్న తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ రావు

**పాకాల, జూలై 9, ప్రభాతవార్త**

తిరుపతి జిల్లా పాకాల మండలంలోని స్థానిక ఎంపీడీవో ఆఫీస్ నందు ఎమ్మార్వో సత్యసాయి అధ్యక్షతన బిఎల్‌వో లకు రిగ్యులర్ ట్రైనింగ్ క్యాంప్ లో భాగంగా బుధవారం బిఎల్‌వోలకు ట్రైనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ రావు పాల్గొని బిఎల్‌వో ట్రైనింగ్ క్యాంపు నందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పైన బిఎల్‌వో పామ్స్ ఎలా తీసుకోవాలో వాటి పైన దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు, వీఆర్ఏలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# చంద్రగిరి నియోజవర్గంలో సింగ్‌విండో చైర్మెన్‌లు నియామకం



*తిరుపతిరూరల్, జూలై 09 ప్రభాతవార్త:* చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఏడు సింగిల్ విండో చైర్మెన్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ పరిధిలోని యర్రావారి పాళ్యం, రామచంద్రాపురం, మల్లంగుంట, చిన్నగొట్టుకల్లు, ప్రస్తుతం అఫిషియల్ సభ్యులుగా ఇన్‌చార్జి కమిటీలు ఉన్నాయి. వాటిస్థానంలో ప్రభుత్వం తాజాగా నాన్ అఫిషియల్ సభ్యుడుగా ఇన్‌చార్జి కమిటీలను ఏర్పాటు చేసింది. చిన్నగొట్టుకల్లు సింగిల్ విండో చైర్మెన్‌గా ఎం.ప్రభాకర్, కమిటీ సభ్యులుగా జి.సుభాని, పి. అలివేలమ్మ, యర్రావారిపాళ్యం సింగిల్ విండో చైర్మెన్‌గా ఎస్.రఘు, కమిటీ సభ్యులుగా పల్లెపాకు నాగరాజ, డి.దేవేంద్రనాయుడు, రామచంద్రాపురం సింగిల్ విండో చైర్మెన్‌గా సి.జనార్ధన్ చౌదరి, కమిటీ సభ్యులుగా ఎ.చిరంజీవి, ఎం.చిరంజీవి, తిరుపతిరూరల్ మల్లంగుంట సింగిల్ విండో చైర్మెన్‌గా సి.మధు శేఖర్, కమిటీ సభ్యులుగా వి.చిరంజీవి, పి.మోహన్ రెడ్డి, ఐతేపల్లి సింగిల్ విండో చైర్మెన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కమిటీ సభ్యులుగా బి.భాస్కర్‌బాబు,, ఎం.వెంకటముని, నర్సింగాపురం సింగిల్ విండో చైర్మెన్ ఆర్.వినోద్‌కుమార్, కమిటీ సభ్యులుగా బి.ఉమామ హేశ్వరరావు, టి.రెడ్డెప్ప శెట్టి, పాకల సింగిల్ విండో చైర్మెన్‌గా సావిత్రి క్రిష్ణమనేని, కమిటీ సభ్యులుగా జి.ఆనంద్, పాసం కిరణ్‌కుమార్‌లను నియమించారు.

## -మల్లంగుంట సింగిల్ విండో చైర్మెన్ మధుశేఖర్

తిరుపతిరూరల్ మల్లంగుంట సింగిల్ విండో చైర్మెన్‌గా మధుశేఖర్

తిరుపతిరూరల్ మండలం మల్లంగుంట సింగిల్ విండో చైర్మెన్‌గా వేమూరికి చెందిన మధుశేఖర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మధుశేఖర్ మల్లంగుంట వైస్ చైర్మెన్‌గా పని చేసిన విషయం తెల్సిందే. కమిటీ సభ్యులుగా పాతకాల్వకు చెందిన చిరంజీవి, ముండ్లపూడికి చెందిన మోహన్‌రెడ్డిని నియమించారు

## 13న ఐఐటికి ఇద్దరు మంత్రులు రాక

**శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త**

తిరుపతి ఐఐటిలో ఏర్పాటు చేయనున్న కామన్ ఇన్‌క్యూబేషన్ సెంటర్ ప్రారంభానికి ఇద్దరు మంత్రులు హాజరు కానున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ కె.యన్ సత్యనారాయణ బుధవారం వివరించారు.అలాగే ప్రపంచ పరిశ్రమల సమ్మేళనం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఆదివారం ఉదయం ఈ కార్యక్రమాలను ఐఐటి ఆవరణలో నిర్వహించనున్నట్లు వివరించారు.రోడ్ షో కార్యక్రమాలను తిరుపతిలోని తాజ్ హోటల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు సాగే కార్యక్రమాలకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్,రాష్ట్ర మంత్రి టి.జి.భరత్ జిల్లా కలెక్టర్ డాక్టర్ఎస్ వెంకటేశ్వర్ సిఇఒ డాక్టర్ శేఖర్ బాబుగెద్దం హాజరౌతారని డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు.

## వ్యతిరేక దిశలో వాహనాలు: జరిమానాలు విధింపు

**శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త**



మేర్లపాక టోల్‌గేట్ వద్ద వ్యతిరేక దిశలో పయనిస్తున్న వాహనాలను తనిఖీ చేసి జరిమానాలు విధించినట్లు ఆర్‌టిఓ దామోదర్‌నాయుడు వివరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టోల్‌ప్లాజా వద్ద వ్యతిరేక దిశ పయనం వాహనాలకు సంబంధించి పలు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో బుధవారం ఆకస్మికంగా తనికీ చేసినట్లు వివరించారు.ఈ తనిఖీల్లో ఆటోలు,ద్విచక్రవాహనాలు బస్సులుటోల్ గేట్ నుంచి ఏర్పేడుకు వ్యతిరేక దిశలో వెళుతున్నట్లు గుర్తించామన్నారు. హైవే నందు ఎవ్వరూ కూడా వ్యతిరేక దిశలో వెళ్ళకూడదనే నిబంధన ఉందని ఆర్‌టిఓ వివరించారు. హైవేలో వాహనాలు వేగంగా పయనిస్తుంటాయి వ్యతిరేక దిశలో రావటం వల్ల భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.కాబట్టి ఈ విధానాలకు స్వస్తి చెప్పాలన్నారు. బుధువారం తమ తనిఖీల్లో మూడు ఆర్‌టిసి బస్సులు ఒక కంపెనీకి చెందిన బస్సు టోల్‌ప్లాజా కు సమీపంలోని ఏర్పేడుకు వ్యతిరేక దిశలో వెళుతుండటంతో అదుపులో తీసుకొని వారి నుంచి రూ.8వేలు జరిమాన విధించినట్లు దామోదర్‌నాయుడు వివరించారు.

## ఫ్రీ హోల్డ్ సమస్యకు పరిష్కారం: రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

**తొట్టంబేడు,జూలై 9 ప్రభాతవార్త**



కూటమి పాలనలో గ్రామాల సర్వతోముఖాభి వృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు అన్నారు. బుధవారం మండలంలోని చోడవరం గ్రామంలో ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్బంగా గ్రామంలో పలువురు రైతులు భూ సమస్యలను వివరించారు. ఎంతో కాలంగా తాము కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పరిష్కారం కావటం లలేదన్నారు. ఈ సమస్యకు స్పందించిననాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సమస్యపై చాలా సీరియస్‌గా అధికారులకు ఆదేశించారని త్వరలోనే ఫ్రీహోల్డ్ భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా,సాగునీటి సరఫరాకు సంబందించి వివరించారు. రిషితారెడ్డి మహిళలతో మేమేకమై ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందన అందుతుందా? అనిపెన్షన్లు సక్రమంగా అందుతున్నాయా? అని విచారించారు. ఈ కార్యక్రమాల్లో రావిళ్ళ మునిరాజానాయుడు, రిషితారెడ్డి జయచంద్రనాయుడు, చంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, ప్రతాప్‌రెడ్డి, వెంకటాచలం, మునిరత్నం,బాలాజి రెడ్డి, మునిరాజా, లెక్కల మురళీనాయుడు, రామానాయుడు, రాజేంద్ర,సుశేఖర్ ఖాదర్ భాస్కర్ కమల్‌కుమార్, ఎర్రయ్య, సునీల్,చలపతి,గున్నయ్య, పెంచులయ్య, చెంగమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని సత్కరించిన అంజూరు

**శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త**



వందసంవత్సరాలకు పైగా సుదీర్ఘ చరిత్ర కల్గిన ఆర్‌పిబియస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన తీగల వెంకటయ్యను బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులుసత్కరించారు.ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మహామహులు పని చేసారన్నారు.ఇక్కడ చదువుకున్న వారందరూ మహోన్నత స్థాయిని పొందారన్నారు. పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చి దిద్దాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమాల్లో ఉపాధ్యాయ బృందం రమేష్‌రెడ్డి, దేవప్రసాద్, నీలకంఠేశ్వర.భాను ప్రకాష్, వెంకటముని,ఇందిరమ్మ, రెడ్డప్పచిట్టి, మధు ఆర్కాడు శంకర్, సురేష్, కంఠా ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా వీసీల కాన్ఫరెన్స్‌లో ఎన్ఎస్‌యూ వీసీ

**తిరుపతి విద్య, జూలై 9 ప్రభాతవార్త:**



కర్ణాటకలోని ముద్దెనహలి, సత్యగ్రామ, సత్యసాయి ప్రేమామృతం వేదికగా జరిగిన ఆల్ ఇండియా వైస్ ఛాన్సలర్స్ కాన్ఫరెన్స్ లో జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.భారత్ విశ్వ గురువుగా వెలుగొందేందుకు తీసుకోవాల్సిన నూతన సంస్కరణలు,రీసెర్చ్ ఇన్నోవేషన్స్ ప్రొత్సాహిం చడం, వర్సిటీల బలోపేతం ఈ కాన్ఫరెన్స్ లో విస్తృతంగా చర్చించారు.

## నేటి నుంచి ఐసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ

**తిరుపతి విద్య జూలై 9 ప్రభాత వార్త:**

ఎంబీఏ,ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించన ఐసెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది.14వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుండగా,13వ తేదీ నుంచి 18వరకు వెబ్ ఆప్షన్ కు అధికారులు అవకాశం కల్పించారు. 19న ఆప్షన్ మార్పుకు వెసులుబాటు కల్పిస్తూ, 22వ తేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయనున్నారు. సీట్లు సాధించిన విద్యార్థుల 23వ తేదీ నుంచి 26లోపు తమకు కేటాయించిన కళాశాలలో ప్రవేశం పొందాల్సి ఉంటుంది.

## విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్స్ ప్రారంభం

**తిరుపతి విద్య జూలై 9 ప్రభాత వార్త:**

జాతీయ సంస్కృత వర్సిటీలో పలు పీజీ కోర్సులలో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వారం రోజుల పాటు నిర్వహించనున్న బ్రిడ్జ్ కోర్సును బుధవారం ప్రారంభించారు.వర్సిటీలోని చెలికాని అన్నారావు భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, స్కూల్ ఆఫ్ దర్శన్ డీన్ ప్రొఫెసర్ విష్ణుభట్టాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ నూతనంగా పీజీ కోర్సులలో చేరిన విద్యార్థులకు సంస్కృత భాష.అందులో శాస్త్రీయ అంశాలు,శాస్త్రాల సమగ్ర జ్ఞానాన్ని బ్రిడ్జ్ కోర్సులో అందించనున్నట్లు తెలిపారు.ప్రొఫెసర్ పంకజ్కుమార్‌వ్యాస్,సహాయకఆచార్యులు డాక్టర్ యశస్వి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోండి

**- భరత్‌కుమార్‌రెడ్డి పిలుపు**



**తిరుపతి కలెక్టరేట్,జూలై 9 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో భాగంగా తుమ్మలగుంటలో తొలి అడుగు కార్యక్రమం గ్రామ కమిటి అధ్యక్షుడు భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తొలి అడుగు కార్యక్రమానికి తుమ్మలగుంట ప్రజలు,మహిళలు, యువత నుంచి విశేష స్పందన లభిస్తుంది. భరత్‌కుమార్‌రెడ్డి కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,ఎమ్మెల్యే పులివర్తి నాని నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు కరపత్రాలను ఇంటింటికి పంచిపెడుతూ సీఎం నారా చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్న అభివృద్ధిని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత బిరుదాల హనుమంతరెడ్డి, గ్రామ కమిటి అధ్యక్షుడు పి.భరత్‌కుమార్‌రెడ్డి (బాను)తో పాటు బూత్ ఇంచార్జి బిరుదాల సిద్దారెడ్డి, బూత్ కన్వీనర్ జి. రాధారాయల్, కో కన్వీనర్ ఎన్. గురవారెడ్డి, గ్రామ ఉపాధ్యక్షుడు జి. చెంగల్‌రాయనాయుడు, కో కన్వీనర్ బిరుదాల తులసీరామరెడ్డి, ఉప్పరపల్లి బూత్ ఇన్‌చార్జి అయ్యప్ప, టీడీపీ నాయకులు కె. శేఖర్, రోహిత్ లెక్కల పూడి, టీడీపీ యూత్ సుమన్, ముని, శివ, బాలు, పవన్, పరశురామ్, రామచంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్లకు సింగారాలు:నిరుద్యోగులకు ఉపాధి కల్పన

**వాడ వాడల్లో దేశం జెండాలు రెపరెప , ఎవరి వార్డుల్లో వారు ఇంటింటికి తొలి అడుగు**



**శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని మున్సిపల్ పరిధిలో తెలుగుదేశం నాయకులు ఎవరి పరిధిలో వారు వార్డుల్లో ఏడాది సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దేశం నాయకులు పోటీలు పడి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఇంటింటికి వెళ్ళి ఏడాదిలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు,శ్రీకాళహస్తిలో చేపట్టిన ప్రగతి పనులను వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజ యకుమార్ 17,27 వార్డుల్లో ఇంటింటికి కార్యక్రమాలను నిర్వహించారు. కాగా మీడియా ఇన్‌చార్జి మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గా ప్రసాద్ సారధనయంలో 23వ వార్డు, రాష్ట్ర బిసి విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు,వారి సహాచరులు జయరామారావువీధిలో 'తొలి అడుగు 'కార్యక్రమాలనునిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలతో పాటు శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో సుధీర్‌రెడ్డి ఏడాదిలో చేపట్టిన ప్రగతి పనులను వివరిస్తూ రోడ్లుకు సింగారాలు,పార్కుల అభివృద్ధి,ఆలయ పరిసరాల అభివృద్ధి, ఈద్గాహ్‌ల అభివృద్ధి గురించి వివరించారు.ఈ కార్యక్రమాల్లో దేశం నాయకులు నాగమల్లి వినయ్, కిషోర్, ప్రతాప్‌రెడ్డి, బాలాజి, జగపతి, హరి,కంఠారవేష్, షాకీర్‌అలి, ఆర్ముగం, ఖాదర్‌బాషా, చాన్‌బాషా,పండ్ల మీర్జా,బుజులు, అస్మత్,అనితమ్మ, జ్యోతి, దొరబాబు, ప్రేమ్‌కుమార్ సుబ్బ తదితరులు పాల్గొన్నారు.

## చేతి వృత్తుల వారికి చేయూత: చక్కటి రోడ్లు

**శ్రీకాళహస్తిరూరల్,జూలై 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడ ఎమండలంలో కొయ్యబొమ్మల తయారి క్లస్టర్‌ను ఏర్పాటు చేయటంతో పాటు చేతి వృత్తి కళాకారులకు చేయూత నిస్తూ శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఏడాదిగా ప్రగతి పథంలో నియోజకవర్గాన్ని నడుపుతుండగా రాష్ట్ర ప్రభుత్వం చక్కటి ఆరులేన్ల రోడ్లతో పాటు విమానాశ్రయం అభివృద్ధికి కృషి చేస్తున్నారని మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు అన్నారు. బుధవారం ఏర్పేడు మండలంలోని పాతవీరాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను నిర్వహిం చారు.ఈ సందర్బంగా రాష్ట్ర కార్యదర్శి ఒరెడ్డి వారి గురువారెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితో పాటు పంచాయతీలకు సర్వాధికారాలు అందిస్తూ నూతనవిద్యావిధానంతో కార్పొరేట్ స్థాయి కల్పిస్తూ పాఠశాలల విలీనం తో విద్యాసంస్కరణలతో ముందుకుసాగుతుందని ఇచ్చినమాట ప్రకారం సూపర్ సిక్స్ అమలుకు అడుగులేస్తున్నారని వివరించారు. పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే మండలానికి మహర్దశ వచ్చిందని వివరించారు.ఈ కార్యక్రమాల్లో పేరం నాగరాజు నాయుడు,దనంజయులునాయుడు పున్నారావు,మోహన్‌నాయుడు, చంద్రారెడ్డి,రవినాయుడు, ప్రసాద్‌నాయుడు,మహేష్‌రెడ్డి, దొరస్వామి, బాలాజిరెడ్డి, హంస,కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో రాజ్యసభ సభ్యుడు

**శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాజ్యసభ సభ్యుడు కుటుంబ స భ్యులతో స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. రాజ్య సభ సభ్యుడు పాకా వెంకటసత్య నారాయణ కుటుంబసభ్యులతో రాగా వారికి ఆలయం వద్ద రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ సారధ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు.ఆయనతో పాటు బిజెపికిచెందిన కండ్రిగ ఉమ,మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, చందు తదితరులు స్వాగతం పలికారు.వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం అవకాశం కల్పించారు. దర్శనానంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వదించారు.ఆలయ మర్యాదలతో తీర్ధ ప్రసాదాలనుఅందించారు. ఏర్పాట్లను ఎఇఒ మోహన్,పిఆర్‌ఓ రవిలు పర్యవేక్షించారు

## శివయ్య సేవలో ప్రభుత్వ కార్యదర్శి

**శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త**



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని బుధవారం ప్రభుత్వ కార్యదర్శి శ్రీనివా సార్‌కాగితాల జాయింట్ కార్యదర్శి ఇషాకాలియాలు కుటుంబ సభ్యులతో దర్శించుకునానరు.వారితో పాటు సాంకేతిక సలహాదారు రోహిత్‌కక్కర్, రాష్ట్ర హౌసింగ్ అండ్ అర్బన్‌కు చెందిన ఎన్‌మౌర్య(తిరుపతి కమిషనర్)లు దర్శించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఒ మోహన్,పిఆర్‌ఓ రవిలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏర్పాట్లును శ్రీకాళహస్తిమున్సిపల్ కమిషనర్ సంజీవ్‌రావు పర్యవవేక్షించారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందించారు.

# అయిల్ ఫాం సాగుకు పరిమిత పెట్టుబడి అధిక లాభాలు

## రైతులకు అవగాహన సదస్సు

**తొట్టంబేడు,జూలై 9 ప్రభాతవార్త**



అయిల్ ఫాం సాగుకు పరిమిత పెట్టుబడి చాలని అంతేకాక సులభతరంగా ఉంటుందని అధిక నీటి అవసరం లేదని 3 ఎఫ్ అయిల్‌ఫాం ప్రైవేటు లిమిటెడ్ మేనేజర్ విజయ ప్రసాద్ అన్నారు.బుధవారం మండలంలోని శివనాథపురంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు.తెలుగుగంగ పరివాహక ప్రాంతమైన తొట్టంబేడు లో వాణిజ్య పంటగా ఆయిల్ ఫాం పంటను పండించవచ్చునన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలనుగడించవచ్చునన్నారు. శ్రమ కూడా తక్కువే అన్నారు. ఈ పంటతో రైతులకు స్థిర ఆదాయం ఉంటుందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో జొన్న,వేరుశెనగ,చెరకు వాణిజ్యపంటలుగాపండించే వారన్నారు.ప్రకృతి వైపరీత్యాలు,మారుతున్న వాతావరణం దృష్ట్యా రైతులు అయిల్‌ఫాం మీద దృష్టిసారించటం అభినందనీయం అన్నారు. అయిల్ ఫాం సాగుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు కూడా అందించి ప్రోత్సహిస్తున్నారని వివరించారు. జోనల్ మేనేజర్ వెంకటమురళి మాట్లాడుతు ఎకరాకు సగటున 10టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర మేరకు టన్ను ధర రూ.17వేల ఉందన్నారు.ఈ పంటను ప్రారంభిస్తే 25 నుంచి 30 సంవత్సరాల వరకు స్థిర ఆదాయం వస్తుందని వివరించారు. అంతేకాక అంతర్ పంటలుగా పసుపు,మినుములు, మొక్కజొన్న, కంది,గుమ్మడి వంటి పంటలు వేసుకోవచ్చునని వివరించారు. మండలంలో మొదట శ్రీకారం చుట్టిన విజయశ్రీ అనే రైతు మాట్లాడుతూ తాను గతంలో పలు వాణిజ్యపంటలను సాగు చేసి నష్టాలు చవి చూసానన్నారు. దాంతో అయిల్‌ఫాం పంటపై అవగాహన చేసుకొని చేపట్టినట్లు వివరించారు.ఈ పంట సాగులో ఎలాంటి సమస్యలేవన్నారు.ఈ అవగాహన కార్యక్రమాల్లో సర్పంచ్ రాజమాణిక్యం, ఎంపిటిసి మోహన్‌నాయుడు, రవీంద్రనాయుడు ఉద్యానవనశాఖ అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వైకాపా ఆర్‌టిఐ విభాగం ప్రధాన కార్యదర్శిగా మల్లారపు శ్రీరాములు

**తిరుపతిరూరల్, జూలై 9 ప్రభాతవార్త:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్.టి.ఐ విభాగం చంద్రగిరి నియోజకవర్గం ప్రధాన కార్యధర్శిగా పుదిపట్లకు చెందిన మల్లారపు శ్రీరాములు నియమితులయ్యారు. వైయస్సార్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియశీలక పాత్ర పోషిస్తున్న శ్రీరాములుకు ఆర్‌టిఐ వింగ్ ప్రధాన కార్యధర్శిగా నియామకంపై పలువురు హర్షం వెల్లబుచ్చారు. శ్రీరాములు భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. చంద్రగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడుగా ఉన్న శ్రీరాములకు పదవి రావడంపై పలువురు అభినందించారు.

## అంగన్‌వాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**మండల అంగన్‌వాడి వర్కర్స్ డిమాండ్**



**నింద్ర, జూలై 9 ప్రభాతవార్త :** అంగన్‌వాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని నింద్ర మండల కేంద్రంలో బుదవారం అంగన్‌వాడి వర్కర్స్ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేసి,ర్యాలీ నిర్వహించినారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రంలో పని చేయు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.ఐసిడియస్ బడ్జెట్‌ను పెంచాలి.అంగన్‌వాడిలో పని చేయు వర్కర్స్‌కి కనీసం రు.26000 జీతం ఇవ్వాలి.గ్రాడ్యుటీ జిఒ నెంబరు 8ని రద్దు చేయాలన్నారు.పియఫ్,ఇయస్ఐ అమలు చేయాలి. మినీ సెంటర్‌ను మెయిన్ సెంటర్‌గా జిఒ ఇవ్వాలి.వీటితో పాటు వేసవి సెలవులు వ్వాలి.కార్మిక కోడ్‌ను రద్దు చేయాలి.బాల సంజీవిని యాఫ్‌లో మార్పులు చేయాలన్నారు.రైల్వే విద్యుత్,స్టీల్ బ్యాంకులు ఇన్సురెన్స్ తదితర ప్రవేటీ కరణ విధానాలు ఆపాలన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన భారత్ బంద్

**పాకాల, జులై 8, ప్రభాతవార్త**



పాకాల మండల కేంద్రంలో బుధవారం రోజున జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పాకాలలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో భాగంగా సీఐటియు జిల్లా నాయకులు జిల్లా నాయకులు ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగింది. సందర్బంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల మరియు స్కీం వర్కర్స్‌కు అన్యాయం చేస్తున్నారని, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నదని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, భవన నిర్మాణ కార్మికులకు 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగోడులుగా విభజించారని, అంగన్వాడీ,ఆశ మిడ్ డే మిల్స్ తదితర స్కీం వర్కర్స్ కు కనీస వేతనం 26,000 చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల సమయాన్ని పెంచే ఆలోచన మానుకోవాలని ప్రజలపై అధిక ధరల మోపి పెట్రోల్ డీజిల్ ధరలు నియంత్రణ చేయాలని ఈ సందర్బంగా వేరు పాకాల్లో మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వీటిని ప్రజలకు కార్మికులకు ఉద్యోగులకు అనుకూలంగా వ్యవహరించాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమం మరింత ఉద్యమం చేస్తామని ఈ సందర్బంగా హెచ్చరించారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం...

**రేణిగుంట జూలై 9 ప్రభాతవార్త**



ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రేణిగుంట రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో రూరల్ సీఐ మంజునాథ రెడ్డి గాజులమండ్యం కె ఆర్ సి కాలేజీ విద్యార్థులకు బుధవారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎంతోమంది మత్తు పదార్థాలకు బానిసలై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకున్నారన్నారు.సైబర్ నేరగాళ్ల ఉచ్చుల్లో చిక్కుకోవద్దన్నారు. వాట్సాప్ లో, టెక్స్ మెసేజ్లో పంపే లింకులను క్లిక్ చేయవద్దు అన్నారు. కొంతమంది ఫోన్ చేసి లోన్స్ ఇస్తామని మభ్య పెట్టి మన దగ్గర నుండి ఓటిపి తీసుకొని మన బ్యాంకు ఖాతాలో డబ్బులు ఖాళీ చేస్తారని చెప్పారు. ఎవరికి కూడా ఓటిపి చెప్పకూడదన్నారు. ఎవరైనా సైబర్ మాయగాళ్లు మాటలు చెప్పి ట్రాప్ చేసే ప్రయత్నం చేస్తే వారికి బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఆధార్ నంబర్, ఏటీఎం పిన్ నెంబర్, ఇవ్వకూడదన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సాయంత్రం రేణిగుంట రూరల్ పరిధిలోని పలు కూడళ్ల వద్ద ద్విచక్ర వాహనాల తనిఖీలు నిర్వహించి, హెల్మెట్ల పై అవగాహన కల్పించారు.

## విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు: సిఐ

**తిరుపతి విద్య జూలై 9 ప్రభాతవార్త:**



శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగ నివారణ, సైబర్ నేరాల నివారణల, మహిళలపై అఘాయిత్యాల నివారణ పై అవగాహనా సదస్సు తిరుపతి మహిళా పోలీస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. సత్యనారాయణ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహిళా పోలీస్ స్టేషన్ సిఐ తమాం అహమ్మద్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక యువత ఉన్న దేశం భారతదేశం,అట్టి మన యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకొంటున్నారు.అలా కాకుండా విద్యార్థులందరూ సరియైన దారిలో నడవాలని మాదక ద్రావ్యాలకు బానిస కాకూడదని మాదక ద్రవ్యాల నివారణ గురించి,సైబర్ నేరాల నివారణ గురించి చక్కని అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో గిరిజ, కళాశాల అధ్యాపకులు డా.జే.కొండలరావు, డా.కే.కోటేశ్వరయ్య, పి.హరీష్ రెడ్డి, డా.బి.త్రివేణి, ఎన్.జయలక్ష్మీ అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఏ, సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం

**తిరుపతి విద్య, జూలై 9 ప్రభాతవార్త:**



సీఏ,సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్లు ఇ.గిరిధర్,కె.విశ్వనాథ్ లు తెలియచేశారు. సీఎంఏ ఫలితాల్లో పి. హర్షిత్ 326 మార్కులు, బి.నిరంజన్ 296,డి. తక్షీల్ 292 మార్కులతో టాపర్లుగా నిలవగా మొత్తంగా 85.24 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీఏ ఫలితాల్లో పి.హర్షిత్ 301, ఎం.బాలాజీ 290,బి. నిరంజన్ 289 మార్కులు సాధించి టాపర్లుగా నిలవగా మొత్తంగా 47.37 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలియచేశారు.ఈ అద్భుత ఫలితాలు సాధించినందుకు విద్యార్థులను,అధ్యాపక బృంధాన్ని ఈ సందర్భంగా వారు అభినందించారు.

## మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించండి..!

**టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి లత సుబ్రమణ్యం రెడ్డి**



**రామచంద్రాపురం, జూలై 9 ప్రభాతవార్త:** మహిళల పట్ల వైసిపి నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి బాదూరు లత సుబ్రమణ్యం రెడ్డి అన్నారు. బుధవారం రామచంద్రాపురంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కోవూరు ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వైసిపి నాయకుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. గతంలోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరినీ, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మను, కుమార్తె షర్మిలను వైసిపి నాయకులు ఘోరంగా అవమానించారని దుయ్యబట్టారు. వైసిపి సోషల్ మీడియాలోనూ మహిళలను కించపరుస్తూ మనోవేదనకు గురిచేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిని, చెల్లిని గౌరవించలేని పార్టీ వైసిపి అన్నారు. వైసిపిని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినప్పటికీ ఆ పార్టీ నాయకులకు బుద్ధిరాలేదన్నారు. ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి భేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి




***తిరుపతి కలెక్టరేట్, జూలై 09 ప్రభాతవార్త:*** రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు సరైన చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఆర్‌పీఎఫ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. బుధవారం ఉదయం తిరుపతి ఎస్వీయూ ఎదురుగా ఉన్న ఆర్‌పీఎఫ్ బ్యారక్స్‌లో ఆర్‌పీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ వార్షిక సర్వ సభ్య సమావేశం తిరుపతి శాఖ కార్యదర్శి ఎన్. మనోహరం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి, ఐపీఎఫ్ వెంకటేశ్వర్లు(రేణిగుంట)తో పాటు జోనల్ లీడర్లు రాయుడు, వరప్రసాద్‌రెడ్డి, తిరుపతి శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫ్యామిలీ పెన్షన్స్ సెకండరీ పెన్షన్ల సమస్యలను మెడికల్ సౌకర్యాలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్, ఐపీఎఫ్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్, గుంతకల్, హైదరాబాద్ డివిజన్ల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకై కదిలిన కార్మిక వర్గం

## గూడూరులో ఏఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

గూడూరు, జూలై 9, ప్రభాతవార్త



గూడూరు 22వ సార్వత్రిక సమ్మె నేడు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మిక వర్గం కదిలి తమ హక్కుల పరిరక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించి విజయవంతం చేశారని, 16 డిమాండ్లతో ఈ సార్వత్రిక సమ్మె జరిగిందని గతంలో జరిగిన 21 సార్వత్రిక సమ్మెలు ఒక ఎత్తు ఈరోజు జరిగిన సార్వత్రిక సమ్మె మరో ఎత్తని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య అన్నారు. గూడూరు పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతంలోని వాటర్ ట్యాంక్ నుండి ప్రదర్శనగా రైల్వే స్టేషన్ మీదుగా టవర్ క్లాక్ వద్ద వరకు ప్రదర్శన సాగింది. ఈ ప్రదర్శనలు పెద్ద ఎత్తున నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఎనిమిది గంటల పని విధానం కొనసాగించాలని స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం తిరిగి పునరుద్ధరించాలని కార్మిక సంఘాల ఐక్యత వర్ధిల్లాలని కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలతో గూడూరు పట్టణం మారు మోగింది. ప్రదర్శన అనంతరం టవర్ క్లాక్ వద్ద రాస్తారోకో, మానవ హారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, సిఐటియు నాయకులు అనుబంధ సంఘాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్యలు మాట్లాడుతూ ఈ కార్మిక సమ్మె పెద్ద ఎత్తున విజయవంతమైందని కార్మికులు 16 డిమాండ్ల సాధన కోసం ఈ సమయంలో నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టానికి చట్టబద్ధత కల్పిస్తూ రోజువారి వేతనం 600 రూపాయలకు పెంచాలని ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించాలని అర్బన్ ప్రాంతాలలో కూడా ఉపాధి హామీ చట్టాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు మద్దతుగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్ మద్దతు తెలిపారు. ఈ సమ్మెలో, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సివిఆర్ కుమార్, సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, సునీల్, భాస్కర్, రాఘవయ్య, యాకోబు, రిజ్వాన్, వెంకట కృష్ణ, భాస్కర్, వెంకటాద్రి, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, రాజా, రత్నయ్య, నరసింహులు శెట్టి, దీపు, సిఐటియు నాయకులు జోగి శివకుమార్, బి.వి. రమణయ్య, సీనయ్య, చంద్రయ్య, పుట్ట శంకరయ్య , ప్రభావతి, ముత్యాలయ్య ప్రసాద్, శంకరయ్య, గుర్రం రమణయ్య, అడపాల ప్రసాద్, ఏఐటియుసి, సిఐటియు అనుబంధ సంఘాలు ఆటో యూనియన్ ఆశా వర్కర్స్ అంగన్వాడి వర్కర్స్ మునిసిపల్ కార్మికులు భవన నిర్మాణ కార్మికులు టాక్సీ వర్కర్స్, వీధి వర్తక, వ్యాపార సంఘం కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న వ్యాఖ్యలు సమంజసం కాదు

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, జూలై 9 ప్రభాతవార్త

నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సమంజసంగా లేదని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ మహిళలను గౌరవించడం భారతదేశంలో సాంప్రదాయమని, కానీ వైసీపీ నేతలు మాత్రం దీనికి విరుద్ధంగా మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ చంద్రబాబునాయుడు సతీమణి పట్ల అసభ్యంగా మాట్లాడారని, పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని విమర్శించారని, అలాగే అమరావతిలోని మహిళలను వేశ్యలుగా అభివర్ణించి వారి ఛానల్‌లో మాట్లాడించారని తెలిపారు. ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు బుద్ధి తెచ్చుకుని మహిళల పట్ల అసభ్యకర రీతిలో మాట్లాడటం మానుకోవాలని విజయశ్రీ హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇటువంటి విషయాలను ఖండించకపోగా, సమర్థించడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.

## మెగా పీటీఎం 2.0ను జయప్రదం చేయండి

పెళ్లకూరు జూలై 9 ప్రభాతవార్త :

రాష్ట్రవ్యాప్తంగా, జరుగుతున్న మెగా పిటిఎమ్ 2.0 (తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం) ను పెళ్లకూరు మండలం లో కూడా గురువారం నాడు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, దీనికి సంబంధించి ఇప్పటికే విద్యాశాఖ అందించిన మార్గదర్శక కార్యక్రమాలను సవ్యంగా జరుగుటకు ముందుగా సమావేశాలను ప్రధానోపాధ్యాయులతో చర్చించి తగని ప్రణాళికను తయారు చేసుకున్నారని దీనిలో భాగంగా ఫోటో బూత్, క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా సంబంధమైన ప్రగతి నివేదికలు మొక్కలు పెంపకం తదితర వినూత్నమైన కార్యక్రమాలతో మండలంలోని ఉన్నత , ఆదర్శ, మరియు బిపిఎస్ పాఠశాలలో( 28 పాఠశాలలలో) ఈ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో జరుగుతుందని ఎంఈఓ మించల శంకరయ్య తెలియజేశారు.

## పంటల బీమాపై అవగాహన సదస్సు

పెళ్లకూరు, జూలై 9 ప్రభాతవార్త :

మండలంలోని దిగు చావలి పంచాయతీలో ఉన్న రైతు సేవా కేంద్రంలో బుధవారం నాడు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ లు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు బ్యాంకు లోన్లు ఈ క్రాప్ నమోదు మొదలైన విషయాలపై అవగాహన కల్పిస్తూ పంటల బీమా గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఏడి నాగార్జున ఏవో భారతి అగ్రికల్చర్ అసిస్టెంట్ మణి వెటర్నరీ అసిస్టెంట్ వసుంధర మరియు రైతులు పాల్గొన్నారు.

## జేవివి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ

గూడూరు, జూలై 9, ప్రభాతవార్త

గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రవి హోమ్ నీడ్స్ అధినేత రవికుమార్ దాతృత్వంలో ఆసుపత్రికి వచ్చిన నిరుపేద గర్భిణీ స్త్రీలకు వెజిటబుల్ రైస్, గుడ్డు, అరటిపండులను ముఖ్య అతిథి డాక్టర్ షరీనా చేతుల మీదుగా పంపిణీ చేయడమైనది. డాక్టర్ షరీనా మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక వారు గత 11 సంవత్సరముల నుండి నిరంతరాయంగా మా ఆసుపత్రికి వచ్చే పేద గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ చేస్తున్నారని, కోవిడ్ టైంలో కూడా 120 ఆక్సిజన్ సిలిండర్లు ఇచ్చారని బ్లడ్ డొనేషన్ క్యాంప్ కూడా పెట్టారని మా ఆసుపత్రి సిబ్బందికి ప్రోవిజన్స్ కూడా పంపిణీ చేశారని ఇన్ని కార్యక్రమాలు చేస్తున్న జే.వి.వి సభ్యులందరికీ మా ఆసుపత్రి సిబ్బంది తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, సుబ్బారావు, రజనీకాంత్, ఇబ్రహీం, సురేష్, అరుణ్ కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సిబ్బందికి ఇబ్బందిగా ఉన్న ఫేస్ యాప్ ఎత్తివేయాలి



బాలాయపల్లి, జూలై 9, ప్రభాతవార్త

అంగన్వాడి సిబ్బందికి ఇబ్బందిగా మారిన ఫేస్ యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నియోజక వర్గ నాయకురాలు స్వరూప రాణి తెలిపారు. బాలాయపల్లి తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నా చేశారు. ఫేస్ యాప్ విధానం వల్ల అంగన్వాడి సిబ్బంది ఇబ్బంది పడుతు న్నట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాల వద్ద ఫోన్లు పనిచేయక ఫేస్ యాప్ ను వేయలేకపోతున్నట్లు చెప్పారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. సాఫ్ట్వేర్ ఇంజనీర్లు చేయాల్సిన పనులు తమ దగ్గర చేస్తున్నట్టు తెలిపారు. బాల సంజీవని యాప్ తాతరావు వాటి వల్ల ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. అంగన్వాడి సిబ్బందికి జీతాలు పెంచకపోవడం దారులుమన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, వరలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## సంత కబీర్ అవార్డుకు ఎంపికైన వెంకటగిరి చేనేత కార్మికుడు

వెంకటగిరి, జూలై 9, ప్రభాతవార్త



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేనేత కార్మికులకు ఇచ్చే అవార్డును వెంకటగిరి కి చెందిన లక్క శ్రీనివాసులు ఎంపిక చేసింది. చేనేత జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆయనను సంత కబీర్ అవార్డుకు ఎంపిక చేశారు. ఆగస్టు నెల ఏడో తేదీ చేనేత దినోత్సవం సందర్భంగా శ్రీనివాసులకు అవార్డును ప్రదానం చేయనున్నారు.

## 11న శ్రీ సత్యసాయి అవతార శత జయంతి ఉత్సవాలు

గూడూరు, జూలై 9, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని కుమ్మరి వీధిలో ఏర్పాటై ఉన్న శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ శుక్రవారం శ్రీ సత్యసాయి అవతార శతజయంతి ఉత్సవ వేడుకల్లో భాగంగా స్వామివారి దివ్య ప్రేమ యొక్క శాశ్వత సందేశాన్ని దేశమంతట వ్యాప్తి చెందేలా చేపట్టిన పవిత్ర యాత్ర శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర గూడూరు పట్టణానికి చేరుకుంటుందని, శ్రీ సత్యసాయి సేవా సమితి ద్వారా సాంస్కృతి కార్యక్రమాలు, కన్వీనర్ కె. దాము ప్రతాప్, సేవాదళ్ కోఆర్డినేటర్ మల్లికార్జున్, ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ బి.సుబ్బారావు, శ్రీనివాస్, అరుణ్, నితీష్, లలిత, గౌతమి, భాగ్యలక్ష్మి,సుభాషిణి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు పంపిణీ





గూడూరు, జూలై 9, ప్రభాతవార్త

మెప్మాలో పనిచేస్తున్న 77 మంది రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు గూడూరు శాసన సభ్యులు డా. పాశం సునీల్ కుమార్ చేతులు మీదుగా 32,999 రూపాయిలు విలువ గల ట్యాబ్‌లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పని ఒత్తిడికి గురి అవుతున్నారనే ఉద్దేశ్యంతో మీకు కంప్యూటర్‌లతో సమానమైన, నాణ్యమైన 32999 రూపాయలు విలువచేసే ట్యాబ్‌లను బహుమతిగా అందించారన్నారు. గూడూరు కమీషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్‌పిలు అందరూ ఇక ప్రతి ఆన్లైన్ వర్క్ వేగవంతం చేసి గూడూరు మునిసిపాలిటీని అన్ని కార్యక్రమాలలో ముందుంచి ఎమ్మెల్యేకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని తెలిపారు. అనంతరం గూడూరు లోని పాత బస్టాండ్ సెంటర్, క్లాక్ టవర్ వద్ద గూడూరు మెప్మా రిసోర్స్ పర్సన్స్ అందరూ సమావేశమై ఆర్పిలకు మూడేళ్ళ కాల పరిమితి నిబంధన తొలగింపునకు ఇచ్చిన ఆదేశాలకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య కమ్యూనిటీ ఆర్గనైజర్ చందన, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉషా, పట్టణ సమాఖ్య అధ్యక్షులు సులోచనమ్మ, టిఎల్ఎఫ్ ఆర్పిలు లక్ష్మి, సుజా త, రిసోర్స్ పర్సన్సు లు పాల్గొన్నారు.

## ప్రసన్నకుమార్ రెడ్డిని వెంటనే అరెస్టు చెయాలి

గూడూరు, జూలై 9, ప్రభాతవార్త



కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పై ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన గూడూరు నియోజక వర్గ తెలుగు మహిళలు డిమాండ్ చేసారు. గూడూరు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నల్లపురెడ్డి కుటుంబానికి ప్రసన్నకుమార్ రెడ్డి కళంకం తెచ్చాడు. మాజీ మండల ఉపాధ్యక్షురాలు మట్టం. శ్రావణి రెడ్డి మాట్లాడుతూ సమాజానికి మంచి చేస్తూ, సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్న వేమిరెడ్డి కుటుంబం పై ఇలాంటి అసభ్య పదజాలాలతో వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు.లీలావతి మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలు సహజం, వ్యక్తిగత విషయాల్లోకి వెళ్లి అసభ్య పదజాలాలు వాడడం వైసిపి నేతలకే చెల్లుతుందన్నారు. ఒక మహిళ చేతిలో ఓటమి ప్రసన్నకుమార్ రెడ్డి జీర్ణించుకోలేక పోతున్నాడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షురాలు మల్లి. శ్యామల, మాజీ కౌన్సిలరు కల్పన, సుబ్బమ్మ, విజయమ్మ, అంకమ్మ పాల్గొన్నారు.

## ఘనంగా ఏబీవీపీ 77వ ఆవిర్భావ వేడుకలు

గూడూరు, జూలై 9, ప్రభాతవార్త

స్థానిక ఒకటవ పట్టణ పరిధిలో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల సమక్షంలో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పూర్వ జాతీయ కార్యవర్గ సభ్యులు మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని నిరంతరం విద్యార్థుల కోసం పనిచేస్తూ విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిస్తుంది అన్నారు. పూర్వ రాష్ట్ర కార్యదర్శి మన్నూరు మల్లికార్జున మాట్లాడుతూ వివేకానందుని మాట ఏబీవీపీ బాట అని భరతమాతను విశ్వ గురువు చేయడం కోసం విద్యార్థి పరిషత్ గత 77 సంవత్సరాలుగా విద్యార్థులలో పని చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, పూర్వ కార్యకర్తలు మనోహర్, శివశంకర్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే పాశం

గూడూరు, జూలై 9, ప్రభాతవార్త



గూడూరు మండల పరిధిలోని విందూరు గ్రామంలో సూపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ పర్యటించారు. విందూరు గ్రామం నందు ఇంటింటికి ప్రచారం లో పాల్గొని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను అందచేశారు. ఉపాధి నిధులతో 10 లక్షల రూపాయలతో నిర్మించిన సి.సి రోడ్, 5 లక్షల రూపాయలతో నిర్మించిన స్మశాన వాటిక ప్రహరీ గోడను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పంచాయతీలో ఏమైనా అభివృద్ధి జరిగిందంటే చంద్రబాబు నాయుడు హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప మరే ప్రభుత్వం చేయలేదు అన్నారు. ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్ రెడ్డి, మట్టం శ్రావణి రెడ్డి, బొమ్మిరెడ్డి పెంచల్ రెడ్డి, ఏగిరెడ్డి మల్లికార్జురెడ్డి, కార్తీక్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ గంజాయి విక్రేతలు అరెస్ట్ - 10 కేజీలు స్వాధీనం



సూళ్లూరుపేట, జూలై 9 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న ఆరుగురిని బుధవారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక బజార్ పల్సర్ మోటార్‌బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిఐ ఎం.మురళీకృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూళ్లూరుపేటకు చెందిన కె.చంద్రకాంత్, ఎం.శైలేష్, వేనాటి శ్రీతో పాటు విజయవాడకు చెందిన ఎ.భరత్ కౌశల్, తడ మండలానికి చెందిన బి.తేజా, పి.నరేంద్రలను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. వీరు గత కొంతకాలంగా గంజాయిని తీసుకొచ్చి సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో అక్రమంగా విక్రయిస్తున్నారని తెలిపారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో వీరిని ప్రత్యేకంగా నిఘా పెట్టి పట్టుకున్నామన్నారు. ఎస్ఐ వి.బ్రహ్మనాయుడు, ఎఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి, కానిస్టేబుళ్లు గిరీష్‌కుమార్, సురేష్, విజయ తదితరులు వీరిని పట్టుకోవడంలో చొరవ చూపించారన్నారు. వీరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు సిఐ మురళీకృష్ణ తెలిపారు.

## గ్రీవెన్స్‌డేకు గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

కోట, జులై 9 ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమానికి కొందరు అధికారులు రావడం లేదని, అటువంటి అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి దాసరి అంజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జయజయరావు మాట్లాడుతూ సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి కొంతమంది అధికారులు హాజరు కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు ఉప్పల శేషయ్య, జడ్పిటిసి సభ్యులు దాసరి కోటయ్య, సర్పంచులు, ఎంపిడిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## యాప్‌ను రద్దు చేయాలంటూ అంగన్‌వాడీల ధర్నా

కోట, జులై 9 ప్రభాతవార్త



అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రభుత్వం చెలగాట మాడుతుందని అంగన్‌వాడీ ప్రాజెక్టు సెక్టార్ నాయకురాలు ఆర్‌వి రమణమ్మ, విజయలక్ష్మి, సుజాత ఆరోపించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు యాప్‌లు ఇవ్వడంతో అటు బాలింతలు, ఇటు గర్భిణుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నా ఫొటోలు మ్యాచ్ కావడం లేదన్నారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు ఫోన్లు చేతబట్టి ఇళ్ల చుట్టూ తిరుగుతున్నా వైఫై నెట్ కనెక్షన్ కనెక్ట్ కాకపోవడంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఇవి మ్యాచింగ్ కాకపోవడంతో బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న సరుకులు ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే ప్రీ స్కూల్‌ని గాలికి వదిలేశామని, ఒక్కబిడ్డకు కూడా అక్షరాలు నేర్పించలేకున్నామన్నారు. ఈ యాప్‌ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు. అనంతరం తహశీల్దార్ జయజయరావుకు వినతిపత్రం అందజేశారు.

## భూములను పరిశీలించిన సబ్ కలెక్టర్

కోట, జులై 9 ప్రభాతవార్త

కోట మండలం వెంకన్నపాలెం పంచాయతీ పరిధిలోని వీరారెడ్డిసత్రంలో బుధవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా భూములను పరిశీలించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా కన్వర్షన్ చేయాలని రైతులు అధికారులను కోరారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆ భూముల వద్దకు వచ్చి సంబంధిత భూములకు సంబంధించిన రికార్డులను తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ

సూళ్లూరుపేట, జులై 9 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో తడ మండలంలోని బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని గుర్రపు తేజశ్రీకి బుధవారం రూ.13 వేలు విలువైన స్పోర్ట్స్ కిట్ అందజేశారు. ఈ విద్యార్థిని ఇటీవల అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో నిర్వహించిన స్టేట్ లెవల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తృతీయ స్థానం సాధించింది. ఈ విద్యార్థిని ప్రోత్సహించేందుకు ఈ సామగ్రిని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారు అందజేశారు. అలాగే ఈ పాఠశాలలో చదువుతున్న శ్రీదేవి, శృతి, మౌనిక, కీర్తి, అక్షిత అనే విద్యార్థినులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వీరికి కూడా ఆచార్య భరద్వాజ సేవాసంస్థ తరపున స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, పీడీ సునీత, భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి

సత్యవేడు, జూలై 9 ప్రభాతవార్త:



కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రి త్వ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల ఆ శాఖ ఉన్నతాధికారులతో కలసి బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రణాళిక, ప్రస్థానం, పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు. చర్చల సందర్భంగా శ్రీసిటీలో అభివృద్ధి చెందుతున్న సామాజిక వసతులపై ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. గృహ సముదాయాలు, విద్యా వసతులు, షాపింగ్ కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాల గురించి హైలెట్ చేశారు. అలాగే ఇక్కడ అమలు చేస్తున్న సమర్థవంతమైన నీటి వనరుల నిర్వహణ, మురుగునీటి రీసైక్లింగ్, ఘన వ్యర్థాల నిర్వహణ, హరిత హిత చర్యలు, ఇతర సుస్థిరత కార్యక్రమాలను వివరించారు. కార్యదర్శితో పాటు కేంద్ర గృహ నిర్మాణశాఖ(అమృత్ పథకం) సంయుక్త కార్యదర్శి ఇషా కాలియా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య, ఎంహెచ్‌యూఏ సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్, ఇతర సీనియర్ అధికారులు, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు ర్యాలీ





కేవీబీ పురం, జూలై 9 ప్రభాతవార్త:

దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మికుల సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన కేవీబీ పురంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు ర్యాలీ, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్మిక సంస్థ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఆశ వర్కర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ నాయకులు వేతనాలు పెంచుతామని క్రమబద్ధీకరణ చేస్తామని హామీలను వెలబుచ్చారు. కానీ దానిపైన ఎవరు కూడా పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంత వరకు ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎలాంటి హామీలకు నోచుకోలేకపోతున్నామని తెలిపారు. మా జీతాలు పెంచాలని పలు నినాదాలు చేశారు. అనంతరం కేవీబీ పురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్మికులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## పోలీసుల ఆంక్షల నడుమ వైఎస్ జగన్ పర్యటన

### కార్యకర్తలపై పోలీసు లాఠీచార్జీ - ఎస్పీతో వైఎస్ జగన్ వాగ్వివాదం

బంగారుపాళ్యం, జులై 9 ప్రభాతవార్త

మామిడి రైతుల పరామర్శ కోసం బుధవారం బంగారుపాళ్యంకు మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విచ్చేశారు. వైఎస్ జగన్ పర్యటన పూర్తిగా పోలీసుల ఆంక్షల నడుమ కొనసాగింది. హెలిప్యాడ్ నుండి మార్కెట్ యార్డు వరకు సుమారు 3 కిమీ రహదారికి ఇరువైపులా పోలీసులు తమ అధికార జులంను ప్రదర్శించారు. వైఎస్ జగన్‌ను చూడటానికి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు చెన్నై-బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా చేరుకున్నారు. అయితే పోలీసులు అత్యుత్సాహంతో కార్యకర్తలపై లాఠీ చార్జీ చేశారు. ఈ ఘటనలో కొంతమంది కార్యకర్తలు గాయపడగా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన శశిధర్ అనే కార్యకర్తకు తలకు తీవ్ర రక్తగాయం అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న కాన్వాయ్‌లోని మాజీ సిఎం వైఎస్ జగన్ ఆ కార్యకర్తను పరామర్శించడానికి కారు నుండి దిగడానికి ప్రయత్నించారు. ఎస్పీ మణికంఠ చందోలు కాన్వాయ్ కారు నుండి కిందికి దిగడానికి వీలు లేదని గాయపడిన కార్యకర్తను ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ఆ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలుకు మాజీ సిఎం వైఎస్ జగన్ మధ్య కొంత వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎట్టి పరిస్థితుల్లోను మీరు కాన్వాయ్ కారు నుండి కిందికి దిగడానికి వీలు లేదని ఎస్పీ ఖరాకండీగా చెప్పారు. వైఎస్ జగన్ కాన్వాయ్ తిమ్మోజిపల్లి, నలగాంపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి మాధవనగర్ మీదుగా మార్కెట్ యార్డుకు చేరుకుంది. దారి పొడుగునా కార్యకర్తలను నివారించడానికి పోలీసులు అడ్డగోలుగా వ్యవహరించారు. మార్కెట్ యార్డులో గాయపడిన కార్యకర్త శశిధర్‌ను వైఎస్ జగన్ దగ్గరికి పిలిచి ఓదార్చారు. వైఎస్ జగన్ పర్యటనకు వస్తున్న కార్యకర్తలు, నాయకులను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. తెల్లవారుజాము నుండి బంగారుపాళ్యంకు వచ్చే అన్ని మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ఎవ్వరిని రానీయకుండా పోలీసులు ప్రయత్నించారు. ఓ దశలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, వెంకటేగౌడ, చిత్తూరు సమన్వయకర్త ఎంసి విజయానందరెడ్డిలు పోలీసులతో వాగ్వివాదంకు దిగారు.



కార్యకర్తలపై లాఠీ ఛార్జీ చేస్తున్న పోలీసులు. పోలీసులతో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వాగ్వివాదం

## గంగజాతర లో గంగమ్మకు విశేష పూజలు చేసిన ఎమ్మెల్యే

పుత్తూరు రూరల్, జూలై 9 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని దళితవాడలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను గంగమ్మను దర్శించుకుని విశేష పూజలు చేశారు. అలాగే కార్య నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు. గంగజాతరకు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నగరి ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి, శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలు అందించారు.

## వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం



బంగారుపాళ్యం, జులై 9 ప్రభాతవార్త: మామిడి రైతులను పరామర్శించడానికి బంగారుపాళ్యం విచ్చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధిక సంఖ్యలో వైకాపా నాయకులు ఘన స్వాగతం పలికారు. గంట ఆలస్యంగా వైఎస్ జగన్ బంగారుపాళ్యంకు విచ్చేశారు. వైఎస్ జగన్‌తో పాటు హెలిక్యాప్టర్‌లో ఎంపీ మిథున్‌రెడ్డి వచ్చారు. రాష్ట్ర మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, లలితథామస్, వెంకటేగౌడ, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, వైకాపా మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, వైకాపా నాయకులు ప్రకాష్‌రెడ్డి, గోవిందస్వామి, కృష్ణమూర్తి, కిషోర్‌కుమార్‌రెడ్డి, గజేంద్ర, జగదీష్, నాగరాజు, మహేంద్ర, మంజునాథ్, సర్దార్ తదితరులు వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. అలాగే మార్కెట్ యార్డులో రైతులను పరామర్శించిన అనంతరం తిరిగి అదే హెలిక్యాప్టర్‌లో వైఎస్ జగన్ బెంగళూరుకు బయలుదేరి వెళ్ళారు. అదే రీతిలో వైకాపా నాయకులు వైఎస్ జగన్‌కు వీడ్కోలు పలికారు.